# వెన్నెలలో చీకటి రహస్యం

## ● పైడిపల్లి సత్యానంద్

**సుందరరామయ్యగారు వాలు కుర్చీలో కొంచెం కదిలారు. ప్రక్కకు జారి పోతున్న ఉన్ని రగ్గును పైకి లాక్కుని వెచ్చగా కూర్చున్నారు. ఎదురుగా మాధవీలతచేత అల్లుకొనబడిన మామిడిచెట్టు కొమ్మల మధ్య నుంచి మరికొంచెం పైకి కదిలాడు చంద్రుడు.**

ప్రక్కనున్న నైట్‌క్వీన్ ఆ వెన్నెల రాత్రికి పరిమళాలను పంచి పెడుతోంది. తోట ప్రశాంతంగా వుంది. ఎడంగా వున్న అందమయిన బంగళాలోంచి పల్చగా మెల్లగా తెరలు-తెరలుగా వినవస్తోంది అద్భుతమయిన పాశ్చాత్య సంగీతం.

సుందరరామయ్యగారు చెట్లుకొమ్మల మధ్య చిక్కుకున్న పున్నమి చంద్రుడి వైపు చూస్తున్నారు... ఆయనలో ఏదో ఆలోచనల అలజడి...

"ఇదే చంద్రుడు, ఇదే వెన్నెల - బాల్యంలో ఏదో తెలియని ఆశ్చర్యాన్ని, ఏదేదో ఆకాంక్షని రేకెత్తించేవి. అటుపైన ఇదే వెన్నెల తనలో ఏదో కోరిక, వేడి, బాధ ఏదేదో వ్యధ కలుగజేసేది. ఆ రోజుల్లో సృష్టిలో చాలా చాలా తనలో చిత్రమయిన భావాలను లేవదీసేవి.

సన్నజాజులు, సంపెంగలు, మల్లెలు మాధవీలత పందిరి క్రింద పల్చటి నీడలు, సముద్ర తీరాలు, నదీ తరంగాలు మెల్లగా, సన్నగా పోకే మృదువయిన సంగీత స్వరాలు, సాయం సమయాలలో కలసిపోతూ సంధ్యారాల్చిన ఎర్రని రేఖలు, రాత్రివేళలలో వెన్నెలలో తోటలో గడ్డి మీద వెల్లకిలా పడుకుని తన 'ఎద'కు ప్రతిరూపంగా ఆకాశంలో చంద్రుడిని ఊహించుకుంటూ ఆనందంగా గడిపిన క్షణాలు — చీకటి రాత్రిళ్ళలో భయంగా వాన కురిసే సమయంలో చల్లటి చీకటిగదిలో నిండుగా రగ్గు కప్పుకుని తెరచిన కిటికీలోంచి బైటకి చూస్తూ రాత్రి తన కళ్ళలోంచి కురిపించే నల్లటి చల్లటి రుధిరంలా వానను ఊహించుకుంటూ, హఠాత్తుగా మెరిసే తటిల్లతను చూసి ఒళ్ళు పులకరింపు చేసుకున్న క్షణాలు, తెలతెలవారే సమయంలో తోటలోని ముద్దబంతి పువ్వు మీద తళుక్కుమని క్షణకాలం మెరసి జారిపడి అదృశ్యమయ్యే మంచు బిందువు, ఆకాశం నవ్విన నవ్వు వంటి హరివిల్లు, అందమయిన అమ్మాయి నవ్విన నవ్వువంటి అరుణబింబం, మురిసిన జగత్తు మోహనంగా నవ్విన నవ్వువంటి వెన్నెల, ఆడపిల్లలు వారి అమాయకపు నవ్వులు, పువ్వులు, పాటలు, మేఘాలు, గాలి తెరలు, చలి, వేడి - ఏదో తెలియని కోరిక. అర్థంలేని తపన, ఆశ తెలియని ఆవేదన. ఏదేదో వేదన, మథన, వ్యధ, తియ్యటి బాధ, యవ్వనం తనలో ఒళ్ళు విరుచుకున్న హొయలు — ఇంకా ఇంకా — ప్రేమ — ప్రకృతి సౌందర్యము, ఆకర్షణ, అనురాగము, ఆవేదన, ఆరాధన, తృష్ణ, వాంఛ — అంతే! ఆ తరువాత వివాహం.

అటుపైన వెన్నెలలో పెద్ద మార్పు. ఆ మార్పు బావుంది.

వెన్నెలలో డాబా మీద మల్లెపువ్వు వంటి మంచం మీద, మల్లెలతో వున్న 'మల్లె'వంటి ఆమె వేడిలో తాను కదిలి, కరిగి ఐక్యమయిన క్షణాలు — లేత వెన్నెలలో మాధవీలత గుబురులో తన కౌగిలిలోని ఆమె ఎద స్పందనకు తనలో ఏదో తెలియని సస్పందన. ఆనాడు వెన్నెలలోని వేడి, వాడి, విలువ మరింతగా అర్థమయింది. తమ ఆనందాల అనుభూతుల చిహ్నంగా లోకంలో కళ్ళు తెరచి ఒళ్ళు విరుచుకున్న మగశిశువు. అటుపైన కాలం వేగపు కదలిక. ఆ తరువాత అలవాటు పడిన తమ జీవితాలకు "వెన్నెల" విసుగు పుట్టించసాగింది. అటుపైన జీవితంలో పూర్తికాని ఆశయాల అలలు, అంతంకాని ఆలోచనల కలలు — అంతులేని కోరికల వలలు. ఇంటిలో కరువు — ఏవో కలతలు — చిన్న చిన్న నలతలు — కుటుంబం మీద ఏహ్యత. అవసరాల మీద ఆవేశం, అయినవారి మీద అసహ్యం. కుటుంబావసరాల సంఘర్షణలో కొత్తగా పుట్టిన కోపం, బ్రతుకు మీద ఏహ్యత. నరాలలో అశక్తత. మనసులోని బలహీనత. తన మీద తనకే చిరాకు, పరాకు. అణిగి ఆగిపోయిన పాతకోర్కెల ప్రకోపనలు భరించలేని బాధలు, తనని తాను చేసుకుంటున్న మోసం. సృష్టిలో స్తంభించిన చైతన్యం కార్చిన కన్నీరు — తనలోని అశక్తతకూ బలహీనతకూ తార్కాణంగా తన చేతిలోంచి జారి విరిగి పోయిన ఖాళీ అయిన బ్రాందీ సీసా. మైకంలో మరణించిన తనలోని మానవుని లోంచి జనించిన వేరొక దానవుని విచిత్ర చర్యలు. ఆ దానవుడు వేదనతో దగ్గరకు వచ్చిన ఆమెను అసహ్యంతో దూరంగా గెంటిన క్షణాలు. గడప మీద పడి నుదురు బద్దలు కాగా కారే ఆమె ప్రతి నెత్తురు బొట్టు పొడిచివేయబడిన సృష్టి అనే కళ్ళలోంచి మానవత్వం జార్చిన ఫలించని కోర్కెల కన్నీరుగా తనలో కదలటం. ఆమె ఆ క్షణంలో అరిచిన బలహీనమయిన అరుపు, బలహీనమయిన మానవత్వం దానవత్వం మీదకి ఆవేశంగా తలపడి మతి గోల్పోయి దూసిన విచ్చుకత్తిలాగా —

సృష్టిని చీల్చుకుని భీకరమయిన క్షణాలలో పుట్టిన వికృత పిశాచం నవ్విన పిచ్చినవ్వులాగా, కుబుసం విప్పుతూ బుసకొట్టిన కోడెత్రాచు పాడుకోరలాగా, తన మీది అసహ్యంతో ఆమె అరిచి చెప్పిన రహస్యంలాగా, నిర్దాక్షిణ్యపు క్షణాలలో హతమార్చబడుతున్న ఆకారం లేని తన అసహాయతలాగా, తనకు తోచిన క్షణాలు, ఆ తరువాత తనలో జనించిన అశక్తతను, లక్ష్యాలు లేని కోపం, కసి, పగ, అన్నిటినీ సారా సమాధిలోకి తోసివేయాలని, బ్రాందీ బాటిల్‌లో వుంచి బిరడా బిగించాలనే తన ప్రయత్నం, అంతలోనే ఏనాడో ఆమె తను ఆనందించిన క్షణాల అనుభవాలకు సాక్ష్యంగా పెరుగుతున్న ఆకారం అసహ్యంతో తనను నిందించడం...నిద్రాణ మయిన తనలోని పశుత్వం పిచ్చిగా రెచ్చిపోయి ఆమెను, అతన్ని బయటికి గెంటటం — వారు ఇల్లు విడిచి వెళ్ళిపోవడం — వెళ్ళిపోయినవారిని తలుచుకుని ఎందుకో తెలియని కోపంతో వెక్కి వెక్కి ఏడవడం — ఒంటరిగా చీకటి గదిలో ఎద ప్రసవించిన ఏదో తెలియని వికృతమయిన ఆవేదనా శిశువు పిశాచపు

27-7-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

మూల్గులు. ఒంటరిగా వెన్నెలలో — ఇదే వెన్నెలలో ఏడ్చి ఏడ్చి లోకాన్ని శపిస్తూ తన అసహాయతకు దుఃఖించడం. 'చావాలనే కోరికను' చంపేసిన తనలోని "ఆశ" అహంకారం. అనుకోకుండా ఒక సాయం సమయంలో సముద్రతీరంలో తటస్థపడి పరిచయమయిన "వెల"గల అందం — కోటి గుండెలు నిండిన తన గుండెలో ఆమె మీద జనించిన కొత్త కోర్కె — ఆమె మీద ఆశకి తనలో జనించిన తృష్ణ — ఆ తరువాత కొన్ని వెన్నెల రాత్రిళ్ళలో విచిత్రమయిన ఆనందాన్ని ఆమె నుంచి తాను ఖరీదయిన "ఖరీదు"కు కొనడం — చేతిలో "వెల" లేని సమయంలో తప్పనిసరిగా "తప్పు" అని తెలిసినా లోకం ఇచ్చిన అధికారపు సొమ్మును వెచ్చించి ఆమెతో కలసి వెన్నెలలోని వేడి యొక్క రహస్యాలను మధించి — శోధించటం — అంతే — ఉద్యోగం పోవటం — న్యాయ స్థాన విచారణ — జరిమానా — కొత్త వేస్తురాలి కుటిలమయిన నవ్వుల క్రీనీడల వీడ్కోలు ఆ తరువాత — ఆ తరువాత.

సుందరరామయ్య కుర్చీలో కొంచెం కదిలి పట్టేసిన చేతిని కొంచెం కదిపి సరిగా కూర్చున్నారు...

ఆ తరువాత — బ్రతుకు మీద ఏహ్యతతో, జీవితం మీద కసితో తాను మరింతగా తన మీదే పగ తీర్చుకోవాలని, తనను తాను హింసించుకోవాలని మరింతగా తాగటం — అటుపైన గుండెలో నొప్పి అంతలో తను చేసిన పొరపాట్లు రక్తంగా ఆకారం మార్చుకుని గొంతు నుంచి బయటపడి వెన్నెల వెలుగులో తనను చూసి వెర్రిగా నవ్వటం — చీకటి గుహలాంటి గుండెలో ఆకారం లేని అనేక ఆకారాలు రగిల్చిన వెలుగులేని అగ్నిజ్వాలల బాధ అన్నీ కలసి తనలో ప్రవేశపెట్టిన చిత్రమయిన జబ్బు దానికి టి.బి. అని లోకం పెట్టిన పేరు. అటుపైన చావు బతుకుల సంగ్రామం — ఒక రోజు రాత్రి వెన్నెల మడుగులో వెల్లకిలా పడుకుని బొంగురుపోయిన గుండె. ఏవేవో రహస్యాలను "దగ్గు" రూపంలో వెన్నెలకు విశదపరచే వేళలో, వెన్నెల చావుని మరీ మరీ రహస్యం చెబుతున్న వేళలో తనను చేరిన ఆ తల్లీ కొడుకును తనను తమ చేరువ కంటా చేకొని తమ వెంట తనను తీసుకునిపోవటం. ఆ తరువాత మానవత్వానికి, ప్రేమను నిర్లక్ష్యంగా తాను చేసిన తప్పులు మన్నించినవారు తనకు చేయించిన ఖరీదయిన వైద్యం-ఆ సమయంలో ఆస్పత్రి కిటికీలోంచి ఆప్యాయంగా వెన్నెల పలకరింపులు, తెల్లటి బట్టలలోని నల్లటి నర్సు చల్లని మాపులు–ప్రక్క బెడ్డు మీది పాటలు పాడే పసికుర్రవాడి అమాయకపు మాటలు– ఆదరణగా అనిపించే డాక్టరుగారి చేతలు...ఆయన వెంట వచ్చే తెల్లటి బొమ్మకుక్క ఆటలు...నున్నటి వరండాలు — విశ్శబ్దమయిన హాలు. కిటికీలోంచి కనిపించే ఎర్రటి పిట్టల పాటలు తీయని ఆ వాతావరణంతో తనకు ఏదో హాయి. ఆ తరువాత ఆనందంతో తాను డాక్టరు దగ్గర నుంచి వీడ్కోలు. అటుపైన తన కొడుకయిన అతను "ఆర్మీ"లో పై 'రాంక్'కి రావటం. అతనితో కలిసి తామిద్దరూ వచ్చేయటం. కాలం హాయిగా కదలటం — చంద్రుడి వంటి కొడుకు నిరిపే. ఆప్యాయతా వెన్నెల నీడలలో గతంలోని అనుభవాల జ్ఞాపకాలను కలగా తలచుకుంటూ వుండిపోవటం.

సుందరరామయ్యగారు కుర్చీలోంచి లేచారు. చంద్రుడు చెట్ల కొమ్మల మధ్య నుంచి చెట్టుపైకి వచ్చాడు. తన వెన్నెల సహాయంతో లోకాన్ని అంటించి, మండించి చల్లటి వెలుగు సృష్టిస్తున్నాడు. సుందరరామయ్యగారికి గతంలో వెన్నెల కలిగించిన చల్లటి వేడి, తియ్యటి బాధా గుండెలో కదిలాయి. యాభయ అయిదేళ్ళ నుంచి ఏకధాటిగా అనేక రకాల వేగాలలో స్తంభించని చైతన్యంతో ప్రవహించి ప్రస్తుతం వడి, సవ్వడి లేకుండా ప్రశాంతంగా ప్రవహించే ఆయన నెత్తురు ఎందుకో గతంలోని ఉధృత వేగాన్ని అనుకరించబోతోంది. కానీ నరాల బలహీనత సరియయిన సహకారం ఇవ్వటం లేదు. పడమరకి దగ్గర అయిన ఆయన ఎదభాగుడు ఎందుకో వెనక్కి వెళ్ళబోతున్నాడు. వాడిపోయిన ఆయన వయస్సుని, చరిత్ర శిథిలాలలోనికి చొచ్చుకుంటూ గతంలోకి జారిపోయే మనసు మరీ మరీ రమ్మని పిలుస్తోంది. ఆయన ఆలోచనలు గతంలోని సౌందర్యారాధన ఆవరణలలోకి వెళ్ళిపోతున్నాయి. ఆయనకి అదేదోలావుంది. మెల్లగా బంగళాకేసి నడిచారు. వరండా చేరుకుంటున్నారు.



లోపల నుంచి పాశ్చాత్య సంగీతం మృదువుగా వినబడుతోంది. ఆయన మెట్లెక్కి హాలు ద్వారం వద్దకు వచ్చారు.

హాలులోని అందమయిన రంగు రంగుల దీపాలు నాగరికత రహస్యాన్ని స్పష్టపరుస్తున్నాయి. హాలులో అనేకులయిన ఆర్మీ ఆఫీసర్లు నాగరికతను పాటిస్తూ అందమయిన సౌందర్యాలతో కలిసి మెల్లగా నృత్యం చేస్తూ సభ్యతను సంతరించుకుంటున్నారు. ఆ హాలులోని సంగీతం చావుపుట్టుకల మధ్య పుట్టే ఆనందాల అలల ఏటిమీదగా కదలి ఏటిగాలితో కలిసి ఎదను సోకుతూ ప్రియుడు చెప్పిన మధురమయిన రహస్యంలా వినవస్తోంది. సుందరరామయ్యగారు ఆ జంటల వైపుచూస్తున్నారు.

అదిగో — తన కొడుకు — బలంగా, దృఢంగా — అతని తల్లి మనసులా విశాలమయిన ఛాతీ — ఆ ఛాతీ మీద ఆనుకుని కదులుతున్న ఆంగ్లోయిండియన్ యువతి. ఆమె సన్నటి నడుము చుట్టూ పెనవేసిన అతని బలమయిన చేయి. ఆమె చెంపల మీదుగా రహస్యం చెప్పేటందుకు వాలినట్టుగా వున్న అతని తల. ఆమె కురుల విరులలోకి పోతూ మత్తుగా మూసుకున్న అతని కళ్ళు... ఆ జంట కొంచెం ప్రక్కకి తిరిగింది.

వయసులోని వేడికి, వాంఛకు ప్రతినిధులుగానూ, నిదర్శనాలుగానూ వున్న అందమయిన ఆమె వక్షాలు అతని ఛాతీకి అదమబడి బాధగా బరువుగా ఉక్కిరిబిక్కిరయి ఊపిరి పీల్చుకుంటోన్నట్లు చలిస్తున్నాయి.

సుందరరామయ్యగారి పెదాలు ఎందుకో అదిరాయి.

ఆ జంట కదిలింది. సల్పగా — సన్నటి ప్రవాహంలాగా వున్న ఆమె నడుము మీద మెల్లగా చల్లగా కదిలే అతని చేయి క్రిందకి - మరీ క్రిందకి....

సుందరరామయ్యగారు ద్వారం దాటి హాలులోకి ప్రవేశించి ప్రక్కగా స్తంభం దగ్గర నిలుచుండిపోయారు.

హాలులో మెల్లగా ఆక్రమించుకున్న మత్తయిన సల్పటి సంగీతం అంతకు ముందే సేవించిన ఖరీదుగల గమ్మత్తయిన ఇంపోర్టెడ్ "విషా" దగ్గరగా సౌందర్యమయిన మెత్తటి శరీరాల వేడి, పరవశింపజేసే పరిమళం. నాగరికత అందించిన అవకాశం. వయసు ఇచ్చే ఆవేశం. అన్నీ కలిసిన ప్రోత్సాహంతో ఆ జంటలు మత్తుగా మెత్తగా కదులుతున్నాయి.

సుందరరామయ్యగారు సూటిగా అటే చూస్తున్నారు.

ఆయనలో ఏవేవో కదులుతున్నాయి. గతంలోని వేడి అనుభవాలు, వెచ్చటి వెన్నెల క్షణాలు, ప్రక్క మీద నలిగిపోతున్న పువ్వుల వాసనలు. పెదాల మీద అదమబడిన పెదాలు నవ్విన నవ్వులు — శరీరం నుంచి శరీరం పొందే సౌఖ్యం తాలూకు పాత జ్ఞాపకాలు. పాతకాలంలో కొత్తగా పొంగిన పడుచు నెత్తురు ఉద్రుతపు హొయలు — అన్నీ అన్నన్నీ — ఎన్నో ఇంకెన్నో — ఎన్నెన్నో.

ఆయన మనసు ఆ వయసులో కోరరాని కోరికను కోరుతోంది. ఆయన వయసు మనసులాగ యౌవనంలోకి వెళ్ళలేకపోతోంది. ఆయన మనసు కోరికను కనేందుకు పురిటినొప్పులు పడుతోంది. ఆయన వయసు తప్పనిసరిగా అనుభవాలను ఆహ్వానిస్తోంది. సుందరరామయ్యగారి నరాలు — శరీరం — ఎందుకో బాధగా మూల్గబోతున్నాయి. ఆయన వయసు ఆ మూల్గుని కళ్ళతో గతంలోకి గ్రుచ్చి గ్రుచ్చి చూస్తోంది. ఆయన మస్తిష్కం ఆలోచనాలోచనాలతో అనుభవాల అఖాతపు అంచులను పరికిస్తోంది. హఠాత్తుగా — అంతలో — ఆ క్షణంలో —

ఆ హాలులోనేకాక బంగళా మొత్తం మీద లైట్లు ఆరిపోయాయి. చీకటి, నల్లగా వున్న పాపంలాంటి చీకటి నగ్నంగా నృత్యం చేయసాగింది. చిన్న చిన్న కేకల వంటి అస్పష్టపు అరుపులు — అలజడి — పిలుపులు — విడిపోయిన జంటల సందడి. కళ్ళకి కానరాక తాకిన బల్లల మీద నుండి జారి శబ్దం చేస్తున్న సీసాలు.

సుందరరామయ్యగారు చీకటిలో ముందుకు నడిచారు.

సువాసనలు — నవ్వులు — బట్టల గరగర — గాజుల గలగల — చిన్న చిన్న మాటలు — అంతా చీకటి

సుందరరామయ్యగారు అలాగే నిలుచుండిపోయారు.

ఆ క్షణంలోనే — ఆ చీకటి సౌందర్యంలోనే — ఎవరో ఆయన భుజాల మీద




చేతులు వేసి మొహం ముందుకు పోనిచ్చి ఆయన పెదాలకు, పెదాలు తాకించి మృదువుగా ముద్దుపెట్టుకున్నారు.

అంతే — ఆ క్షణంలో

వేడిగా వున్న మంచుగడ్డ, మండుతున్న మల్లెపువ్వు, పొగలు క్రక్కే వెన్నెల కిరణాలు, విరిగిన ఇంద్రధనుస్సు ముక్కలు, కాల్చివేసే కోరికల నవ్వులు, వర్షింపబోయే మేఘపు తునకలు, అన్నీ కలిపి అందమయిన కోమలి కామపుకోరికల కడగంటి చూపు వంటి మెత్తని కత్తిని తయారుచేసి దానితో సుతిమెత్తగా ఆయన పెదాలు చీరినట్టు, ఆ కాలం క్షణం ఆకారం దాల్చుకునే కొద్ది సమయంలో, కాలచక్రం నిలిచి సృష్టి స్తంభించినట్లు, విరుచుకుపడే కెరటం ఒక్కసారిగా ఆగిపోయినట్లు, జలపాతం అంచు వద్ద క్రిందకి దుముకబోయే నీరు స్తంభించినట్లు, సౌందర్యం నగ్నంగా నృత్యం చేస్తూ హఠాత్తుగా ఆగినట్లు, గుండెలోకంటా బలంగా దింపబడిన కత్తిని బయటకి లాగుతోన్నట్లు, రక్తనాళాలు సాగి, పొంగి, బీట్లు పడి బద్దలయి వాటి నుంచి రక్తానికి బదులు సువాసనలు విరజిమ్మే వెన్నెల సోనలు వెలువడుతోన్నట్లు, శరీరం చిల్లులు పడి వాటి నుంచి సౌందర్య సుగంధధూమం బయలుదేరుతోన్నట్లు, అనేక ఏళ్ళ [illegible]క్రితం మండి ఆరిపోయిన అగ్నిపర్వతం ఒక్కసారి మళ్ళీ మండి కోరికల లావాను వెలువరిస్తోన్నట్లు, మస్తిష్కం అరవబోయి మూగబోయినట్లు కొండ అంచు నుంచి జారిపడే మనిషి శూన్యంలో క్షణకాలం ఆధారం లేకుండా ఆగినట్టు, గుండె క్రొత్త పద్ధతిలో గట్టిగా కొట్టుకుంటూ ఒక్కసారి నిలిచి కటక్ మన్నట్లు, భూమి తిరగటం మానివేసినట్లు, గ్రహాలు గతి తప్పినట్లు, సృష్టి రూపుమార్చుకున్నట్లు, మానవుడు మరణించినట్లు, ఏదో, ఏదేదో...

ఆ క్షణం అయిపోయింది, ఆమె వెళ్ళిపోయింది.

అటుపైన లైట్లు వెలిగాయి. అంతా సందడి — సరదా.

ఆ హాలులో ఆ ప్రక్కగా స్తంభానికి ఆనుకుని చైతన్య విహీనులయి జన్మరాహిత్యం పొందినట్లుగా నిలబడిపోయారు సుందరరామయ్యగారు. ఆయన అన్నివేపులా చూస్తున్నారు.

ఎవరామె? ఎవరామె? ఎలాగ తెలుసుకోవటం? తాను గుర్తించినదల్లా ఆమె పెదాలు పల్చగానూ, అల్పంగానూ, మంచు ముక్కల్లాగా, వెన్నెల మొరికలాగా మధురమయిన మెరుపు తునకలాగా, మృదువుగా, తడిగా, సువాసనగా, చల్లగా, మెత్తగా, మత్తుగా, అంతే -- ఎవరామె? జరా భారంతో వున్న తనను, సౌందర్య విహీనుడయిన తనను వయసు విడాకులిచ్చిన తనను, ఆ విధంగా ఎండిన తన పెదాల మీద పదిలంగా తన పెదాలతో ముద్దును భద్రపరచుకున్న ముద్దరాలు ఎవరు?

హాలులో అందరివైపు చూస్తున్నారు ఆయన.

కొడుకు దగ్గర నిలుచుని అతని ఛాతీ మీద చేతితో రాస్తున్న ఆంగ్లో యిండియన్ అమ్మాయా, లేక ఆ ప్రక్క లావుపాటి వ్యక్తి ముందు నిలుచుని అతని కళ్ళలోకంటా చూస్తున్న ఆ సన్నటి సుందరా, ఆవైపు బల్ల దగ్గర కూర్చుని ఆ కుర్రవాడు చెప్పేది వింటున్న పంజాబీ పిల్లా, ఆ నలుగురి మధ్యా నిషాగా నవ్వుతున్న తురకల అమ్మాయా (ఆ అమ్మాయి అయితే బాగుండును). లేక ఆ బెంగాలీ అమ్మాయా?

ఎవరు? ఎవరు? ఎవరు?

పార్టీ ముగిసింది. అతిథులు వెళ్ళిపోయారు. హాలు శూన్యమయింది. నిశ్శబ్దం అలుముకుంది. సుందరరామయ్యగారికి ఆ హాలు శ్మశానంలాగా నిశ్శబ్దంగాను, చావులా చల్లగానూ, చీకటిలా నల్లగాను అనిపిస్తోంది. మెల్లగా సుందరరామయ్య గారు తన గదిలోకి వెళ్ళిపోయారు.

మంచం మీద వెల్లకిలా పడుకున్నారు. కిటికీలోంచి వాలుగా మీదపడే వెన్నెల జాలు ద్వారా చంద్రుడిని అడుగుతున్నారాయన.

ఎవరామె? ఎవరామె? ఎవరామె?

అది వెన్నెలలోని చీకటి రహస్యంలాంటి ప్రశ్న. దానికి చంద్రుడే కాదు సృష్టిలోనే జవాబు లేదు... మరి జవాబు రాదు.

* * *

సాయంకాలం నుంచి తనలో కదిలిన గతం జ్ఞాపకాలు, అనుభవాల కోరికలు రగిల్చిన వేడి, వయసు మళ్ళిన కోరికల ఆఖరి తపన తాపత్రయం. అన్నీ కలిపి అందించిన ఉద్రేకం — వెన్నెలతో పొంగి హాలులోని నృత్యాలకు వాయిద్యాలకు ఉధృతంగా ఉప్పొంగి, విజృంభించగా, ఆగలేక, ''తప్పు'' అని తెలిసినా తప్పనిసరిగా హాలులోకి అడుగెట్టి ఎవరి పెదాల మీదో ముద్దు ఇచ్చిన ఆ పెదాల వ్యక్తి ఎవరు? అంటూ —

అదే రాత్రి వెన్నెల వెలుగు వేరొక కిటికీగుండా తన పల్చటి పెదాలను స్పృశించే సమయంలో ఆలోచిస్తోంది—ఆ పెదాల హక్కుదారిణి అయిన ఆమె — ఆ యాభయ్ ఏళ్ళ మనిషి — సుందరరామయ్యగారి భార్య అనసూయాదేవి గారు...

(1967 మధు నుంచి)

## ''శనిదానం''

శనివారం ఆంజనేయ స్వామి గుడి భక్తులతో కిటకిట లాడుతూంది.

అంతకంటె ఎక్కువగా రావి చెట్టు కింద వున్న నవగ్రహాల ముందు జనం తోసుకుంటున్నారు.

నల్ల మినుములు, నువ్వులు, నూనె, శనీశ్వరుడి విగ్రహానికి అభిషేకం చేసి ఆ ఖాళీ సీసాలని అక్కడే పడేస్తున్నారు.

ప్రక్కనే మండపంలో కూర్చొన్న శాస్త్రి గారికి కూడా శక్తి కొద్దీ తిలదానం ఇచ్చి తృణమో పణమో దక్షిణ కూడా సమర్పించుకొని వెడుతున్నారు.

నిజానికి శనివారంనాడు అదీ... అలాంటి 'శని దానాలు' ఏ బ్రాహ్మణుడూ తీసుకోడు.

కాని శాస్త్రిగారిది పెద్ద కుటుంబం.

వేరే జరుగుబాటు లేక శని మంత్రం నేర్చుకొని ఆ విగ్రహాల ముందే కూర్చున్నాడు.

మిగతా విషయాల మాట ఎలా వున్నా ఆదాయం బాగానే వుంది.

ఇంతలో ఓ భక్తుడు - పేరు అప్పారావు- గభాల్న వచ్చి శాస్త్రి గారి కాళ్ళ మీద పడ్డాడు. ''నన్ను శని పట్టుకుంది స్వామి. దాన్ని ఒదిలించుకుందుకు ఏదన్నా మంత్రం చెప్పండి'' అంటూ గొల్లు మన్నాడు.

''ఇంతకీ అసలు విషయం ఏమిటి నాయనా! ముందు నా కాళ్ళు వదలండి. మీకు వచ్చిన కష్టం ఏమిటి? మిమ్మల్ని ఏలినాటి శని పట్టుకుందా... లేక పధ్నాలుగేళ్ళ శని పట్టు...''

శాస్త్రిగారి నోటిమాట పూర్తి కానేలేదు.

అప్పారావు తల బాదుకున్నాడు.

''అయ్యా! నన్ను పట్టింది ఏలినాటి శని కాదు, పధ్నాలుగేళ్ళ శని అసలే కాదు. ఏడేడు జన్మల శని స్వామీ! వద్దు వద్దంటున్నా వినకుండా మా నాన్న బలవంతాన మా అత్త కూతురు ఆండాళ్ళుతో నా పెళ్ళి జరిపించాడు. ఆ శని వదిలే మార్గం చెప్పండి'' అంటూ లబ లబలాడాడు.

విషయం అర్థం అయిన శాస్త్రి గారు వేదాంతిలా నవ్వాడు.

''ఆ శని వదిలించుకునే మంత్రం తెలియకనే కదా నాయనా నేను ఈ 'శని' మంత్రం జపిస్తున్నాను'' అన్నాడు తన గయ్యాళి భార్యని జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

– కాకాని కమల